
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 1 సెప్టెంబరు 2025



గిట్టుబాటు ధరలు లేక రైతులే స్వయంగా తొలగిస్తున్న బొప్పాయి పంట

● రాజంపేట, కోడూరు నియోజకవర్గాలు ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. అరటి, బొప్పాయి, మామిడి, నిమ్మ తదితర ఉద్యాన పంటల ద్వారా లక్ష ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీలు లేనందువల్ల పండిన పంటలను నిల్వ చేసుకోలేక ధరలు లేకపోయినా అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం బొప్పాయి ధర కిలో ఐదు రూపాయలకు పడిపోయింది. రైల్వేకోడూరులో మామిడి 200 కోట్ల రూపాయలు వ్యాపారం జరగాల్సి ఉండగా ధరలు లేక కేవలం రూ.50 కోట్లకు పడిపోయింది. చేసేదేమిలేక రైతులు మామిడి కాయలను రోడ్లలో పారవేశారు. ప్రస్తుతం ధరలు తగ్గిపోవడంతో బొప్పాయి, అరటి రైతుల పరిస్థితి కూడా అలాగే ఉంది. పంటను నిల్వ చేసుకోవడానికి కోల్డ్‌స్టోరేజీలను ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా ప్రత్యేక శాఖలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాల్సి ఉంది.


## సీఎం సారూ!



● కడప-రేణిగుంట రోడ్డు పనులను ప్రారంభించండి
● రాజంపేట జిల్లా కేంద్రం హామీని అమలు చేయండి ● శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్దరించండి

# మాపై దయ చూపండి

● అన్నమయ్య ప్రాజెక్టును పునరుద్ధరించండి ● సీఎం చంద్రబాబుకు ప్రజల వినతి



నాలుగేళ్లుగా పునరుద్దరణకు నోచుకోని అన్నమయ్య ప్రాజెక్టు

రాజంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం రాజంపేటకు వస్తున్న సందర్భంగా ఈ ప్రాంత ప్రజలు ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నాలుగేళ్ల కిందట వైసీపీ పాలకుల పాపం వల్ల రాజంపేట, కోడూరు రైతాంగానికి వరప్రసాదినిగా ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వల్ల తీవ్ర ప్రాణనష్టంతో పాటు ఆస్తినష్టం జరిగింది. ఈ సమయంలో 22,500 ఎకరాలు అన్నమయ్య ఆయకట్టు భూమి బీడుగా మారిపోయింది. అన్నమయ్య ప్రాజెక్టును వెంటనే పునర్నిర్మించి ఎగువ, దిగువ ప్రాంత రైతులకు నష్టం జరగకుండా ప్రత్యేకంగా కాలువలను ఏర్పాటు చేసి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కోడూరు-వెంకటగిరి రోడ్డు రూపుదాల్చుకుని ఫారెస్ట్ క్లియరెన్స్ రాకపోవడంతో దానిని అర్ధంతరంగా నిలిపిశారు. ఆ దారిని పునరుద్ధరిస్తే వెంకటగిరి, రాజంపేట, కోడూరు ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

● ఉమ్మడి కడప జిల్లాను వేధిస్తున్న ప్రధాన సమస్య జాతీయ రహదారి ప్రస్తుతం స్టేట్ హైవే కడప-రేణిగుంట వరకు డబుల్ రోడ్డులో వేలాది వాహనాలు వెళుతున్నందున ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఇటీవలే కేంద్ర వన సంరక్షణ సమితి అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ సమయంలో భూసేకరణ పూర్తి చేసి రెండేళ్లలో కడప-రేణిగుంట జాతీయ రహదారిని పూర్తి చేస్తే ఉమ్మడి కడప జిల్లా వాసులకే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, కర్నూలు, అనంతపురం ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.



అలంకారప్రాయంగా శ్రీరామ ఎత్తిపోతల పథకం

● గతంలో రాజంపేట డిపో 150 బస్సులతో కళకళలాడేది. నేడు 50 బస్సులకు పడిపోయింది. అన్ని అద్దె బస్సులే. కోడూరులో కేవలం గుంజనేరు ఆనుకుని కంపచెట్ల మధ్య ఓ చిన్నపాటి ఆర్టీసీ బస్టాండ్ ఉంది. ఈ ఆర్టీసీ బస్టాండు ఎప్పుడూ దుర్గంధంతో కనీస సౌకర్యాలు లేకుండా ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 15 బస్సులు ఏర్పాటు చేసింది. ప్రస్తుత సమయంలో కోడూరు బస్టాండును అభివృద్ధి పరిచి రాజంపేట, కోడూరు వాసులకు ప్రయాణ వ్యవస్థను మెరుగుపరచడానికి కనీసం 50 ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

● ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్ర భద్రాద్రిగా ఒంటిమిట్టను ప్రకటించి టీటీడీలో విలీనం చేసి వంద కోట్ల అభివృద్ధి ప్రణాళికలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారు. రూ.30 కోట్లతో శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్ట చెరువుకు నీరందించే పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ పథకం మరుగునపడిపోయి ఒంటిమిట్ట చెరువుకు చుక్కనీరు రాకుండా పోయింది. అదేవిధంగా కల్యాణ మండపం నిర్మాణం సగంలో ఆగిపోయింది. అదేవిధంగా అన్నదాన పథకానికి ఇంకా శ్రీకారం జరగలేదు. కోదండరాముడి కల్యాణం రోజున ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన మేరకు శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని, కోదండ రామాలయ అభివృద్ధిని వెంటనే చేపట్టాల్సి ఉంది.

### జిల్లా కేంద్రం హామీని నిలబెట్టుకోండి

● సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గత ఏడాది ఏప్రిల్ 24వ తేదీ రాజంపేటలో జరిగిన భారీ బహిరంగసభలో అశేష జనవాహినినుద్దేశించి చంద్రబాబు ప్రసంగిస్తూ జిల్లాల విభజనలో రాజంపేటకు అన్యాయం జరిగిందని, రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాజంపేట ప్రాంత ప్రజలు చంద్రబాబును కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుపొందడం, టీడీపీ రాజంపేట ఇన్‌చార్జిగా జగన్‌మోహన్‌రాజును నియమించడం, వెంటనే పెన్షన్ల పంపిణీకి సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు రాజంపేటకు వస్తుండడంతో రాజంపేట, కోడూరు ప్రజలు అనేక సమస్యలు సమస్యలు పరిష్కారమవుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

● రాజంపేట మున్సిపాలిటీ పూర్తిగా సమస్యల వలయంలో కూరుకుపోయింది. పట్టణంలో వైసీపీ ప్రభుత్వం కనీసం ఒక్క సిమెంటు రోడ్డును కూడా వేయలేదు. రాజంపేట పట్టణానికి ప్రత్యేక నిధులు కేటాయించి రింగ్ రోడ్డును ఏర్పాటు చేసి రాజంపేట పట్టణాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

### తాళ్లపాకను అభివృద్ధి చేయండి

పదకవితా పితామహుడు అన్నమాచార్యుల జన్మస్థలం తాళ్లపాక గ్రామంలో కనీస సౌకర్యాలు లేవు. గతంలో 108 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసినా ధ్యానమందిరం నిర్మించినా 600 జయంతి ఉత్సవాలు జరిపినా ఇంతవరకు అభివృద్ధి పనులు జరగనేలేదు. జిల్లాకు అన్నమయ్య పేరు పెట్టినా ఆయన స్వగ్రామాన్ని మాత్రం అభివృద్ధి చేయలేదు. ఒంటిమిట్ట మాదిరిగా తాళ్లపాకను అభివృద్ధి చేయాల్సి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నమయ్య విగ్రహం ముంగిటే పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని, సభను ఏర్పాటు చేస్తున్నారు. కావున అన్నమయ్య పేరు చిరస్థాయిగా ఉండాలంటే ఆయన స్వగ్రామాన్ని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరింత కీర్తి గడించాలని రాజంపేట, కోడూరు ప్రజలు కోరుతున్నారు.



పూర్తిగా పాడైపోయి ఉన్న రాజంపేట-రాయచోటి ఘాట్ రోడ్డు

● రాయచోటి జిల్లా కేంద్రం చేసిన తర్వాత రాజంపేట - రాయచోటి ఘాట్ రోడ్డు పూర్తిగా పాడైపోయి గుంతలమయమై ప్రయాణం చేయాలంటేనే హడలిపోతున్నారు. డొక్కు బస్సులతోనే ఈ ఘాట్ రోడ్డులో ప్రయాణం చేయాల్సి ఉంది. కోడూరు, రాజంపేట నియోజకవర్గాల వాసులు జిల్లా కేంద్రమైన రాయచోటికి పోయి రావాలంటే దినదిన గండగా మారింది. కావున రాజంపేట, రాయచోటి ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేయాల్సి ఉంది.



## రాజంపేటకు నేడు సీఎం చంద్రబాబు రాక

● ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ
● దోబీఘాట్‌లో రజకులతో మాటామంతి
● కార్యకర్తలతో గంటపాటు సమావేశం
● ఒంటిమిట్ట గెలుపుతో విజయోత్సాహంలో తెలుగుతమ్ముళ్లు

రాయచోటి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం ఉదయం రాజంపేటలో పర్యటించనున్నారు. రాజంపేట మండలం బోయనపల్లె గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పలువురికి ఎన్టీఆర్ పెన్షన్లను అందచేయనున్నారు. అనంతరం ఇదే గ్రామంలో దోబీఘాట్‌ను సందర్శిస్తారు. అక్కడ ఉన్న రజకులతో మాట్లాడి వారి సమస్యలు వింటారు. అనంతరం వారికి అవసరమైన పలు ప్రయోజనాలు ప్రకటిస్తారు. ఈ మేరకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ప్రజావేదిక సభాభవనంలో సమావేశం ముగించుకున్న తర్వాత మధ్యాహ్నం 3.25 నుంచి గంటపాటు ముఖ్యమంత్రి రాజంపేట నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఇప్పటికే ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించింది. గతంలో చాలా సంవత్సరాలుగా ఇక్కడ వైసీపీనే గెలుస్తూ వస్తోంది. అయితే ఈసారి తెలుగుదేశం పార్టీ వైసీపీ కోటను బద్దలుకొట్టింది. జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జగన్‌మోహన్‌రాజులు వ్యూహాత్మకంగా వ్యవహరించడం.. ఒకటిన్నర సంవత్సర కూటమి పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు.. వల్ల ప్రజలు టీడీపీకి విజయం కట్టబెట్టారు. దీంతో రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో నూతనోత్సాహం కదం తొక్కుతోంది. ఇదే సమయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా జగన్‌మోహన్‌రాజుకు పార్టీ ఇటీవలే బాధ్యతలు అప్పగించింది. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లలో జోష్ కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యకర్తలతో సమావేశమై ఒంటిమిట్ట గెలుపుపై ప్రత్యేకంగా అభినందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



## పోలీసు పహారాలో రాజంపేట

హెలికాప్టర్‌తో ట్రయల్ రన్ ● పలుసార్లు వాహనాల కాన్వాయ్ రిహార్సల్స్ ● సీఎం బందోబస్తులో 2 వేల మంది పోలీసులు

రాజంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం రాజంపేటకు వస్తున్న సందర్భంగా రాజంపేట పరిధిలోని అన్నమయ్య సర్కిల్ పూర్తిగా పోలీసు పహారాతో నిండిపోయింది. కర్నూలు రేంజ్ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసు యంత్రాంగం అంతా రాజంపేటకు చేరుకుంది. జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, మదనపల్లె డీఎస్పీ ఎస్.మహేంద్ర, ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, సీఎం సెక్యూరిటీ అధికారులు, సీఐలు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, హోంగార్డులు, పోలీసులు, సుమారు 2 వేల మంది పోలీసులు రాజంపేటలో సీఎం బందోబస్తుకు ఏర్పాటు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించిన ప్రత్యేక డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీఎం పర్యటనకు ముందు సీఎం భద్రతా సిబ్బందితో కలిసి పలుసార్లు కాన్వాయ్ రిహార్సల్స్ ప్రత్యేక హెలికాప్టర్‌తో ట్రయల్‌రన్ చేశారు.



భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

### ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

రాజంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటకు సీఎం రాక సందర్భంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలిప్యాడ్‌ను సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ములక్కాయపల్లె రోడ్డులో కారంపల్లె వద్ద పెన్షన్ అందజేయనున్న యడబల్లి సుమిత్రమ్మ ఇంటి వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితులను ఆరా తీశారు. బోయనపల్లె గ్రామంలో ఏర్పాట్లు చేసిన దోబీఘాట్‌ను, గ్రామస్థులతో సీఎం సమావేశమయ్యే ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యకర్తల సమావేశ ప్రాంతాన్ని, పెన్షన్‌దారులతో ఏర్పాటు చేసిన సమావేశ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె, రాజంపేట సబ్‌కలెక్టర్‌లు చల్లా కళ్యాణి హెచ్ఎస్ భావన, రాజంపేట తహసీల్దార్ వీరుమున్నీ తదితరులు పాల్గొన్నారు.



రజకులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



## పసుపుమయమైన బోయనపల్లె, తాళ్లపాక

● వందలాది ఫ్లెక్సీలతో టీడీపీ ఇన్‌చార్జ్ జగన్‌మోహన్‌రాజు హవా ● అడుగడుగునా భారీ స్వాగత తోరణాలు





సీఎం సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జగన్‌మోహన్‌రాజు, ఫ్లెక్సీలతో పసుపుమయంగా మారిన రాజంపేట

రాజంపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజంపేటకు వస్తున్న సందర్భంగా టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు నేతృత్వంలో వందలాది ఫ్లెక్సీలు, పసుపు బ్యానర్లు, జెండాలు కట్టి ఆ ప్రాంతాన్ని పసుపుమయం చేశారు. అన్నమయ్య సర్కిల్ నుంచి రాజంపేట, ములక్కాయలపల్లె, బోయనపల్లె, మదనగోపాలపురం, రాజీవ్‌స్వగృహం వరకు భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి జగన్‌మోహన్‌రాజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా సీఎం స్వాగతం పలుకుతూ జగన్‌మోహన్‌రాజు భారీ బెలూన్లను ఏర్పాటు చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీఎం సభ ఏర్పాట్లను అధికారులతో కలిసి జగన్‌మోహన్‌రాజు పరిశీలించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జన సమీకరణపై సమావేశం నిర్వహించారు. సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేడు రాజంపేటకు రావడం శుభసూచికమన్నారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆరు మండలాల నుంచి హాజరై సీఎం కార్యక్రమాన్ని ద్విగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. నేడు రాజంపేటలో పండుగ రోజు అని, సీఎం రాజంపేట అభివృద్ధికి ఎన్నో వరాలు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## గంగ ఒడికి గణపయ్య




జిల్లావ్యాప్తంగా ఆదివారం గణేశ్ నిమజ్జనోత్సవాలు కోలాహలంగా జరిగాయి. డప్పుల వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లు, యువత కేరింతలతో ఊరేగింపుగా గణపయ్యలను గంగ ఒడికి చేర్చారు. పీలేరులో శోభాయాత్ర వైభవంగా జరిగింది.

గంగ ఒడికి చేరుతున్న గణనాథుడు


రాయచోటి పట్టణంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


లక్కిరెడ్డిపల్లె: నిమజ్జనోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు


నూలివీడులో..


సూర్యనారాయణపురంలో నిమజ్జనోత్సవంలో యువకులు

# ఘనంగా గణనాథుడి నిమజ్జనం

రాయచోటిటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు, రాయచోటి మండల పరిధిలోని మాధవరం, శిబ్యాల, దిగువఅబ్బవరం, గొర్ల ముదివేడు, పెమ్మాడపల్లి, యండపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే పాటలు, చెక్కభజనలు, కోలాటాల మధ్య అంగరంగ వైభవంగా విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ వెంకటచలపతి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని శివనందివీధిలో బోడెం చంద్రావతమ్మ రూ.18,116లు వినాయకుని లడ్డును వేలంలో దక్కించుకున్నారు.

**లక్కిరెడ్డిపల్లె:** మండలంలోని నలందనగర్, చౌట పల్లి, సోమలవాండ్లపల్లె, మద్దిరేవుల, అనంతపురం, నలంద నగర్ సమీపంలోని వినాయకుడిని కోలా టాలు, చెక్క భజనల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. దప్పేపల్లె, అప్పకొండయ్యగారిపల్లె, అనంతపురం గ్రామాల్లో మంత్రి కుమారుడు మండిపల్లి నిశ్చల్‌నాగిరెడ్డి పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నదానం చేశారు.

**గాలివీడు :** మండల వ్యాప్తంగాయువత నృత్యాలు చేస్తూ కోలాటాలు వేస్తూ వినాయకుడిని గంగ ఒడికి సాగనంపారు.

**రైల్వేకోడూరు:** వినాయక చవితి ఉత్సవాల్లో 5వ రోజున వైభవంగా గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి మంగంపేట,అత్తిమానుమడుగు ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. మంగంపేటలోని ఎంప్రద కంపెనీలో ఆ సంస్థ అధినేత విక్రంరెడ్డి ఉట్టి కొట్టారు.

**సుండుపల్లె:** మండల కేంద్రంలోని రామయ్యనగర్‌లో 10 కేజీల లడ్డును మిలిటరీ హరి రూ.50 వేలకు, కలశం టెంకాయను టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు కుటుంబీకులు రూ.5,500లకు, రూపాయి కాయిన్‌ను క్రిష్ రూ.4,500లకు వేలంలో దక్కించుకున్నారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

అగ్రహారంలో రూ.70 వేలకు లడ్డును పీ. కౌసల్య, కలశం టెంకాయను సుబ్బరాయుడు రూ.26 వేలకు , రూపాయి కాయిన్‌ను సుధీర్ రూ.12 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్, తెలుగు యువత మండల అధ్యక్షుడు సురేశ్‌నాయుడు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాజంపేట టౌన్:** రాజంపేట పట్టణంలోని సాయినగర్, ఎర్రబల్లె ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాల్లో ఆదివారం లడ్డూ వేలం నిర్వహించారు. ఈ లడ్డూ పాటకు ఆ ప్రాంతంలోని పలువురు ఆసక్తిగా పాల్గొన్నారు. సాయినగర్ నివాసి జవ్వాజి విజయ్‌సాయి 2.1 లక్షల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. హరిణి హాస్పిటల్ డాక్టర్ చెన్నయ్య, హరిణి దంపతులు రూ.2.05 లక్షలకు స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు.

**నందలూరు:** గొల్లపల్లె గ్రామంలో వినాయక లడ్డూ రూ. 70,500కు అదే గ్రామానికి చెందిన సంపతి గిరిబాబు దక్కించుకున్నారు. నారాయణరాజంపేటలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ సహకారంతో అన్నదానం చేశారు.

**ఓబులవారిపల్లె:** ఓబులవారిపల్లెలో సర్పంచ్ నూకా జైపాల్‌రెడ్డి రూ.68 వేలకు, సీఎం బలిజపల్లెలో రూ.44 వేలకు వై.కోటలో రూ.60 వేలకు లడ్డూను నాగరాజు దక్కించున్నారు.

సిద్దవటం: సిద్దవటం హైలెవల్ వంతెనపై సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట, నందలూరు, కడప, బద్వేల్ ప్రాంతాలకు చెందిన వినాయకుని విగ్రహాలు నిమజ్జనం చేశారు. ఎగువపేట రామాలయం వద్ద 10 కిలోల లడ్డూను రూ.47 వేలకు గట్టుపల్లి రవితేజ దక్కించుకున్నారు.

**రామాపురం :** మండలంలోని కసిరెడ్డిగరిపల్లె, సూర్యనారాయణపురం చెందిన గుజపనేని కిశోర్ ఆధ్వర్యంలో రూ.36 వేలకు, కొత్తపల్లి గ్రామానికి చెందిన బాలిశెట్టి చంద్రమౌళి రూ.41 వేలకు, గువ్వలచెరువు హరిజనవాడలో ఓబులేసు రూ.56 వేలకు, కొత్తపల్లిలో శ్రావణ్ రూ.8,500కు, శ్రీమన్నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు రూ.40 వేలకు లడ్డు దక్కించుకున్నారు.

**వీరబల్లి:** మండల కేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాల మధ్య వినాయకుడి ఊరేగింపు నిర్వహించారు. అన్నదానం చేశారు.

**చిన్నమండెం:** మండల కేంద్రంలోని బలిజపల్లెలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను ఆర్ఎంపీ డాక్టర్ హరి రూ.94 వేలకు దక్కించుకున్నారు. హరిని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కేరళ డ్రమ్స్, డీజే డ్యాన్సులు బస్టాండు కూడలిలో పెద్ద ఎత్తున వాన సంచాలకులు యువకులు, మహిళలు సామూహికంగా నృత్యాలు చేశారు.

**రాయచోటి (నేతాజీ సర్కిల్):** సంబేపల్లె మండలం దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లి, శెట్టిపల్లె గ్రామం, కొండ్రువాండ్లపల్లె, ప్రకాశ్‌నగర్‌కాలనీ మినమరెడ్డిగారిపల్లెలో వినాయక నిమజ్జనాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద జంగంపల్లిలో తణుకు నాగేశ్వరయ్య దంపతులు రూ.33 వేలకు లడ్డూను, వెండి నాణేన్ని ఆంజనేయులు రూ.14 వేలకు దక్కించుకున్నారు. మినమరెడ్డిగారిపల్లెలో పవన్‌కుమార్ 20 వేలకు లడ్డూ దక్కించుకున్నారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో వినాయక నిమజ్జనం చేపట్టారు.

**ఒంటిమిట్ట:** ఒంటిమిట్ట బజారువీధిలో నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.12,500కు కొమరాభాను దక్కించుకున్నారు. మాడవీధిలో రూ.16,500కు మామిళ్ల తనీశ్వర్‌రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. పలుచోట్ల విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మండలంలో 45 వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేసినట్లు సీఐ బాబు తెలిపారు.


సిద్దవటం హైలెవల్ వంతెన వద్ద క్రేన్ల సాయంతో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

**చిట్వేలి:** మండలంలోని వినాయక విగ్రహాలను యల్లమరాజు చెరువులో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాల మండపాలవద్ద అన్నదానం చేశారు. రంగులు చల్లుకొంటూ బాణసంచా పేల్చుతూ నిమజ్జనం చేశారు.

**పెనగలూరు:** చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఈ కొత్తపల్లె గ్రామంలో కొత్తపల్లెకు చెందిన పఠకమూరి ఆనందయ్య నాయుడు, రాజేశ్వరమ్మ దంపతుల ఆధ్వర్యంలో కార్యసిద్ధి వినాయకుని కల్యాణోత్సవం నిర్వహించారు. పెనగలూరు మాజీ సర్పంచ్ బీవీఎల్ నరసింహారెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షురాలు బచ్చల సుమతమ్మ పాల్గొన్నారు. టి.కొత్తపల్లిలో 100 కిలోల లడ్డూను ఉత్సవ కమిటీ సభ్యుడు విశ్వనాథరెడ్డి రూ.1.55 లక్షలకు దక్కించుకున్నారు.


వీరబల్లిలో ఊరేగింపుగా వెళుతున్న వినాయకుడు


చిట్వేలి: నిమజ్జనానికి వెళుతున్న గణపయ్య


పెనగలూరు: వినాయకుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



# రాయచోటికి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

● జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలి ● అఖిలపక్ష కమిటీ డిమాండ్

రాయచోటి టౌన్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): రాయచోటిని జిల్లా కేంద్రంగానే కొనసాగిస్తామని గత ఎన్నికల సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని అఖిల పక్ష కమిటీ నేతలు డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, రాజంపేట కేంద్రాలను ప్రత్యేక జిల్లాలుగా ఏర్పాటు చేస్తామని, రాయచోటి జిల్లా కేంద్రాన్ని కొనసాగిస్తామని గత సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబునాయుడు హామీలు ఇచ్చారని, ప్రస్తుతం జిల్లాల పునర్విభజన కోసమని మంత్రివర్గ కమిటీని వేయడంతో అన్నమయ్య జిల్లాలోని మూడు ప్రాంతాల ప్రజల్లో గందరగోళం నెలకొందన్నారు. అన్నమయ్య జిల్లాలో నెలకొన్న ఈ పరిస్థితిపై ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద నిర్వహించిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగే అర్హతలు అన్నీ ఉన్నాయని, జిల్లా కేంద్రానికి కావాల్సిన భూములు గానీ, నీటి సౌకర్యం గానీ రాయచోటికి పుష్కలంగా ఉన్నాయని, రాయలసీమలో అత్యంత వెనుకబాటుతనం ఉన్న మండలాలైన గాలివీడు, ఎన్‌పీకుంట, పెద్దమండెం, చిన్నమండెం, గుర్రకొండ, కలకడ, కేవీపల్లి, సంబేపల్లె, సుండుపల్లె, వీరబల్లి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట మండలాలకు రాయచోటి కేంద్రంగా ఉందని, ఆయా వెనుకబడిన మండలాల అభివృద్ధికి రాయచోటి కేంద్రంగా జిల్లా కొనసాగాల్సిన అవసరం ఉందని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.


అఖిల పక్ష కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు



## రూ. 25 లక్షల ఆరోగ్య బీమా అమలు చేయాలి

చిట్వేలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మధ్యతరగతి పేదలకు రూ.25 లక్షల ఆరోగ్య బీమాను త్వరగా అమలు చేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు మలిశెట్టి జతిన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం చిట్వేలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రతి పేద మధ్య తరగతి కుటుంబానికి రూ.25 ఆరోగ్యబీమా ఇస్తామని చెప్పారన్నారు. ఆ హామీని అమలుపరిచి ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కేన్సర్ లాంటి కొన్ని ఆరోగ్య సమస్యలకు రూ.25 లక్షలు చాలవని అదనంగా మరికొంత ఖర్చు అవుతుందని కూటమి ప్రభుత్వం ఆలోచించి దీనికి ఏదో ఒక పరిష్కారం చూపాలని జతిన్ కోరారు.

## ఉపాధ్యాయుడికి సన్మానం

రామాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమేనని రామాపురం మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణుడు, జయచంద్ర తెలిపారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కడవకూటివాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుడు బుక్కే శ్రీరాములునాయక్ సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు శ్రీరాములునాయక్ ఆయన కుటుంబ సభ్యులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని వారు ఆయనను ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మెన్ సిటీ రామసుబ్బయ్య, రెడ్డెయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీరాములునాయక్‌ను సన్మానిస్తున్న ఎంఈవోలు, గ్రామస్తులు

## తైక్వాండో పోటీల్లో క్రీడాకారులకు బంగారు పతకాలు

రైల్వేకోడూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీవీఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో కాకతీయ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు పీ. పూర్ణసాయిరెడ్డి, తోషిష్ బంగారు పథకాలను సాధించినట్లు హెడ్మాస్టర్ రమణయ్య తెలిపారు. ఆర్. నవదీప్, సిద్ధార్థరాయల్, భవదీశ్ సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారని తెలిపారు.

నందలూరు : రైల్వేకోడూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన రాయలసీమ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో నందలూరు విస్‌డమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి బంగారు బహుమతులను గెలుచుకున్నారు. ఈ పోటీల్లో అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లాల నుంచి తైక్వాండో విద్యార్థులు పాల్గొన్నారు. విస్‌డమ్ పాఠశాల నుంచి పదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో వలిమి మనోజ్ఞ, మోక్షిత్, విశిష్ట, నిద్వాన్‌నందన్, గగన దీపిక, తసీఫా బంగారు పతకాలు సాధించారు. భువన్, షహనాజ్, సమీనా, సాజిద్ రజత పతకాలుసాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ వలిమి రాధ అభినందించారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో పథకాలు సాధించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ సుధాకర్ పాల్గొన్నారు.



## రైల్వే కోడూరు సమస్యలపై సీఎంకు వినతి

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వివరించినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు ఆదివారం తెలియజేశారు. గత శుక్రవారం కుప్పంలో ఆయనను కలసి రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రికి విన్నవించామని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి మరింత తీసుకు పోవాలని చెప్పినట్లు తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో పార్టీ బలో పేతానికి కష్టపడాలని ముఖ్యమంత్రి చెప్పారని తెలిపారు. పార్టీ లోని కార్య కర్తలు, నాయకులు అందరూ కలసి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని చెప్పారన్నారు.


కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసిన కస్తూరి

## సీఎం చంద్రబాబును కలసిన జీఎన్

రాజంపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఆది వారం ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ సీనియర్ నేత డాక్టర్ జీఎన్‌నాయుడు హైదరా బాదులోని సీఎం స్వగృహంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అన్ని అర్హతలున్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని అన్నమయ్య ప్రాజెక్టును వెనువెంటనే పునరుద్ధరించాలని, ప్రధానంగా రాజంపేటలో ప్రభుత్వ గోశాలతో పాటు గ్రీన్ ఎనర్జీ క్లస్టర్, శ్రీశైలంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.


సీఎం చంద్రబాబుతో జీఎన్‌నాయుడు

## మధ్యంతర భృతి, కరువు భత్యం వెంటనే ప్రకటించాలి

●అపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు డిమాండ్

రాయచోటి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలతో పాటు, కరువు భత్యం వెంటనే ప్రకటించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) జిల్లా అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అపస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన అన్నమయ్య జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలు, డీఏ, మధ్యంతర భృతి చెల్లించడంతోపాటు, త్వరలో పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అపస్ రాష్ట్ర కార్యదర్శి మహమతి, జిల్లా సహాధ్యక్షుడు జీ. నాగేంద్రబాబు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వర్, జిల్లా కార్యదర్శి బాలాజీ, మల్లికార్జున, వెంకటయ్య, మనోహర, మోహన్, చంద్రశేఖర్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అపస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

## ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన ఎర్రగొళ్ల రెడ్డెయ్యకు యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ వర్గానికి స్థానం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు లోకేశ్, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోడి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు సెల్లు శ్రీనివాసులు, కావలి ఆంజనేయులు, శ్రీనివాసులు, చెర్ల సుధాకర్, సెల్లు గంగరాజులు రెడ్డెయ్య యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.


రెడ్డెయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

## 'మానవత' సంస్థకు ఫ్రీజర్ బాక్స్ వితరణ

సుండుపల్లె, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ముడుంపాడు కుర్వపల్లెకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు కసిరెడ్డి ఆనందరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి విమలమ్మ, కుమారుడు రఘువీరారెడ్డి ఆదివారం మానవత స్వచ్ఛంద సంస్థ నెలవారీ సమావేశంలో ఆ సంస్థకు రూ. లక్ష విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను, దాని నిర్వహణకు రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా విమలమ్మను మానవత సభ్యులు శాలువా, డైరెక్టరీ, మెమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గంగిరెడ్డి, కడప టౌన్ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, ఉమ్మడి కడప జిల్లా ఆర్థిక కార్యదర్శి హరికుమార్, అమృనాయక్, నాగేశ్వరరావు, నరసింహ, రవీంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఫ్రీజర్ బాక్స్ అందజేస్తున్న విమలమ్మ

## ఎరుకల హక్కుల సాధనకు పోరాటం

రాయచోటిటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఎరుకల హక్కుల సాధన కోసం పోరాటాలు చేయడంతోపాటు, ఎరుకల జాతి జెండాను ఎగుర వేసి మనువాద సామ్రాజ్యవాదులను తరిమి కొడదామని అఖిల భారత ఎరుకుల హక్కుల పోరాట సమితి జాతీయ కార్య దర్శి అమావాస్య రమణ పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని చిత్తూరు రోడ్డులోని ఎస్టీ కాలనీలో ఎరుకుల జాతి జెండాను ఎగురవేశారు. ఆదివాసీ తెగలపై బ్రిటిష్ వారు తీసుకొచ్చిన క్రిమినల్ ట్రైబ్స్ సిటీ చట్టాన్ని 1952 ఆగస్టు 31న అప్పటి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ రద్దు చేశారని. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 31న ఎరుకుల జాతి జెండాను ఎగురవేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల పోరాట సమితి అన్నమయ్య జిల్లా కార్యదర్శి అమావాస్య రెడ్డెయ్య, దివ్యాంగుల సంఘం నాయకులు కంప రమణ, భారతి, ఎస్టీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.


ఎరుకల జాతి జెండా ఎగురవేస్తున్న వైహెచ్‌పీఎస్ జాతీయ, జిల్లా నేతలు

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజంపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని తెలియజేశారు.

## అన్నమయ్య జిల్లాకు ఐజేయూలో అవకాశం

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ)లో మెంబర్‌షిప్ కోసం జిల్లా కమిటీ సాక్షి ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డిని సిఫార్సు చేసిన ప్రతిపాదనలు అంగీకరిస్తూ రాష్ట్రల కమిటీ ఆమోదించి ఐజేయూ మెంబరుగా ప్రభాకర్‌రెడ్డిని ప్రకటించినట్లు ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వంశీధర్‌లు తెలిపారు. ఈ ఎంపికపై యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, ఈశ్వర్, రాష్ట్రల సమితి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, రామచంద్రయ్య, వెంకటేశ్, జిల్లాకు చెందిన జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇంట్లోకి దూసుకెళ్లిన రాళ్ల ట్రాక్టర్

● ఒకరికి గాయాలు ● కొత్తకారు ధ్వంసం



రామయ్య ఇంట్లోకి ట్రాక్టర్ దూసుకువచ్చి కారును ఢీకొట్టిన దృశ్యం

చక్రాయపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చక్రాయపేటలోని ఓ ఇంట్లోకి రాళ్లలోడుతో ఉన్న ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎర్రగుంట్ల నుంచి రాళ్లలోడుతో ట్రాక్టర్ చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లెకు వెళ్తోంది. ఈ సమయంలో చక్రాయపేటలోని స్టేట్‌బ్యాంక్ ఎదురుగా ఒక స్పీడ్ బ్రేకర్ ఉంది. ఇది గమనించని రాళ్లలోడు ట్రాక్టర్ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో అదుపు తప్పి ట్రాక్టర్ రామయ్య ఇంట్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో రమేష్ అనే వ్యక్తి తన ఇంటి గోడకు పెయింట్ వేసుకుంటున్నాడు. ట్రాక్టర్ అటువైపు రావడం చూసిన తల్లిదండ్రులు రమేష్‌ను పక్కకు తోసేశారు. దీంతో రమేష్ అస్వస్థతకు గురయ్యాడు. అలాగే కొత్తగా తెచ్చుకున్న కారు ధ్వంసమైంది. అస్వస్థతకు గురైన రమేష్‌ను వేంపల్లె ఆసుపత్రికి తరలించగా ప్రాణాపాయం లేదని కాలుకు గాయమైందని డాక్టర్లు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మైలవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపరాల గ్రామానికి చెందిన యువకుడు చిమ్మని వెంకటరమణ (30) పెన్నానదిలోకి ఈతకు వెళ్లి శనివారం గల్లంతైన విషయం తెలిసిందే. యువకుడికి కోసం పోలీసుశాఖ, ఫైర్ సిబ్బంది ముమ్మర చర్యలు చేపట్టిన తర్వాత ఆదివారం ఉదయం యువకుడి మృతదేహం లభ్యమైందని, ఇది చిమ్మని వెంకటరమణగా గుర్తించామని ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్నందున పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు నీటిలో దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## కరెంటు షాక్‌తో గేదె మృతి

సీకేదిన్నె, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలుపల్లె నివాసి నారాయణమ్మకు చెందిన గేదె ఆదివారం కరెంటు షాక్‌తో మృతి చెందింది. పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వద్ద గేదెకు షాక్ తగలడంతో మృతిచెందిందని, నారాయణమ్మకు కూడా గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో రిమ్స్‌కు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో గేదె మృతి చెందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దాదాపు రూ.70వేలు విలువ చేసే గేదె మృతిచెందడంతో నారాయణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బోరు పెద్దపుల్లారెడ్డి(68) మృతి చెందాడు. గ్రామానికి చెందిన పుల్లారెడ్డి బైకులో రోడ్డు దాటుతుండగా మరో బైకు వచ్చి ఢీకొనడంతో కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాగా మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైలును ఢీకొని యువకుడికి గాయాలు


కమలాపురం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలును ఢీకొని విద్యార్థికి గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రైల్వేపోలీసులు తెలిపిన సమాచారం మేరకు... పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన విద్యార్థి శ్రీహరిని వినాయక నిమజ్జనానికి వెళ్లొద్దని కుటుంబసభ్యులు మందలించినందుకు శనివారం రాత్రి రైలు కింద పడడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని పరిశీలించి అదేరోజు రాత్రి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శ్రీహరి 9వతరగతి చదువుతున్నాడు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కిరాణా షాపులో సిగరెట్లు చోరీ

రాజంపేట టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలోని ప్రధాన రహదారిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా ఉన్న కిరాణాషాపులో శనివారం అర్ధరాత్రి వేళ షాపుపై ఉన్న రేకులకు కన్నం వేసి రూ.10 వేలు విలువ చేసే సిగరేట్ ప్యాకెట్లను, రూ.15 వేల నగదు దొంగలించినట్లు యజమాని అబ్దుల్‌గని తెలిపారు. ఈ విషయంపై పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చామని, ఈ మేరకు పట్టణ సీఐ నాగార్జున కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నిమజ్జనంలో అపశ్రుతి

● చెరువులో పడి యువకుడి మృతి



నాగేంద్ర ఫైల్‌ఫొటో

కురబలకోట ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కేరింతలు, ఉల్లాసాల మధ్య సాగుతున్న వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. కురబలకోట మండలంలో చోటు చేసుకున్న ఈ విషాదకర సంఘటన వివరాల్లోకెళితే.. శనివారం వినాయకుడిని గ్రామ సమీపంలోని మల్లేశ్వరమ్మ కొత్త చెరువులో నిమజ్జనం చేసేందుకు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. కాగా చెరువులో ప్రతిమను నిమజ్జనం చేస్తుండగా తొక్కిసలాట జరగడంతో నాగేంద్ర (35) చెరువులో పడ్డాడు. అతడిని కాపాడేందుకు పలువురు విఫలయత్నం చేశారు. మృతుడు పుంగనూరు సమీపంలోని మోదుగులపల్లె వాసిగా స్నేహితులు తెలిపారు. కాగా మృతదేహాన్ని ఆదివారం వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## బోల్తా పడిన ట్రాక్టర్

చక్రాయపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహదేవపల్లె గ్రామంలో ఆదివారం వినాయక నిమజ్జనంలో భాగంగా అపశ్రుతి చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే... మహదేవపల్లెలో వినాయక నిమజ్జనం సందర్భంగా ట్రాక్టర్‌లో ఊరేగింపుగా వెళ్లారు. నిమ్జనం చేసి వస్తుండగా గ్రామ సమీపంలోని ఓ కాల్వలో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. అందులో ఉన్నవారు కాల్వలో పడిపోయారు. ఈ ప్రమాదంలో ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి. హుటాహుటిన అందరిని ఆసుపత్రికి తరలించారు. అయితే ఎవరికీ ఎటువంటి ప్రాణహాని కలగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

AP POLICE SHAKTHI

# ఆపద వేళ.. మహిళల అస్త్రం..

# శక్తి యాప్



● ప్రత్యేక టీములతో అవగాహన సదస్సులు
● జిల్లావ్యాప్తంగా శక్తియాప్ డౌన్‌లోడ్ 14097
● ఎస్‌వోఎస్ ఫిర్యాదులు 66




కడప క్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): శక్తి యాప్ మహిళలకు ఒక అస్త్రం వంటిది. ఆపద సమయంలో వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ఈ యాప్ బ్రహ్మాస్త్రంగా పనిచేస్తుంది. ఒంటరి మహిళలకు ఇది ఒక ఆయుధంలా ఉపయోగపడుతుంది అంటే అతిశయోక్తి లేదు. మహిళలు, విద్యార్థినులు, చిన్నారుల భద్రత, రక్షణ కోసం పోలీసుశాఖ కొత్తగా శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సెల్‌ఫోన్‌లో ఈ యాప్ ఉంటే నిరంతరం ఓ తండ్రి లేదా సోదరుడు, ఓ పోలీసు మీ వెన్నంటి తోడుగా ఉన్నట్లేనని చెప్పవచ్చు. ఈ యాప్ ఓపెన్ చేసి ఎస్‌వోఎస్ ఫోన్‌ను ఊపినా పోలీసులు వస్తారు. అత్యవసర పరిస్థితులు, ఆపదలో చిక్కుకున్న మహిళలు ఈ యాప్ ఓపెన్ చేసి అందులోని ఏపీవీఎస్ ఆప్షన్‌పై నొక్కితే వెంటనే పది సెకన్ల నిడివి గల వీడియో, ఆడియో ఆటోమేటిక్‌గా రికార్డు అయి ఘటనాస్థలం లొకేషన్ సహా పోలీసు కంట్రోల్ రూముకు సమాచారం చేరుతుంది. బాధితురాలు ఏ పరిస్థితుల్లో ఉన్నారో పోలీసులకు అర్థమవుతుంది.

**పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు**

మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఈ యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. గివ్ ఏ కంప్లయింట్ విభాగంలోకి వెళ్లి జిల్లా, పోలీసుస్టేషన్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ అంశంపై ఫిర్యాదు చేస్తున్నారో పేర్కొని మీ వివరాలు నమోదు చేయాలి. కాగితంపై రాసిన లేదా టైపు చేసిన ఫిర్యాదు ప్రతిని అప్‌లోడ్ చేయాలి. దాన్ని పరిశీలించి పోలీసులు మిమ్మల్ని సంప్రదిస్తారు. వేధింపులు, గృహహింస, అత్యాచారం, లైంగిక దాడులు, ఈవ్‌టీజింగ్, పరువు హత్య, యాసిడ్ దాడులు, మానవ అక్రమ రవాణా, బలవంతపు వివాహాలు, బాల్యవివాహాలు, అపహరణలు, సైబర్ బుల్లీయింగ్, ఫోటోమార్ఫింగ్ తదితర నేరాలపై ఫిర్యాదు చేయవచ్చు.

**24గంటలూ అందుబాటులో ఉంటాం..**

శక్తియాప్ ద్వారా ఫిర్యాదు చేసేవారికి అండగా ఉంటాం. అలాగే 24 గంటలూ మహిళలు, బాలికలు, చిన్నారులకు అందుబాటులో ఉంటాం. మహిళలకు, కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ఈ యాప్ ఉపయోగాలపై వివరిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా శక్తి యాప్‌ను 14097మందితో డౌన్‌లోడ్ చేయించాం. ఎస్‌వోఎస్ కాల్స్ టెస్టింగ్ కోసం 2882 మందితో చేయడం జరిగింది. ఒరిజినల్ కాల్స్ 66వచ్చాయి. జిల్లావ్యాప్తంగా ఏడు శక్తి టీమ్‌లు ఉన్నాయి. కడపలో 3, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల సబ్ డివిజన్లలో ఒక్కో శక్తి టీం ఉంది. అలాగే ఒక్కో టీమ్‌లో ఆరుగురు సభ్యులు ఉంటారు. వీరిలో ఒక ఎస్ఐతో పాటు మహిళా సిబ్బంది ఉంటారు. మహిళా సమస్యలపై నిరంతరం మా సిబ్బంది అప్రమత్తంగా ఉండి వారికి అవగాహన సదస్సుల ద్వారా చైతన్యం కల్పిస్తున్నాం.

- బాలస్వామిరెడ్డి,
కడప మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ

**ఒంటరి ప్రయాణానికి ఎంతో ఉపయోగం**

రాత్రివేళ ఎవరూ అందుబాటులో లేకపోతే ఒంటరిగా ఉన్న మహిళలకు ఈ శక్తియాప్ ఎంతో ఉపయోగపడుతుంది. మీరు ప్రయాణించే వెహికల్ నెంబరు కానీ, లైవ్ లొకేషన్ గానీ ఈ గ్రూపులో పొందుపరిస్తే చాలు... నిమిషాల్లో పోలీసులు అక్కడికి చేరి వీరికి నీడలా తోడుంటారు. ఆపద వేళలో వారికి రక్షణ కవచంలా ఈ శక్తియాప్ నిలబడుతుంది.



కడప ఆర్టీసీ బస్టాండులో శక్తియాప్ డౌన్‌లోడ్ చేస్తున్న మహిళా పోలీసుస్టేషన్ సిబ్బంది

## బొప్పాయి తోటల్లో రైతుల నిరసన

● ధరలు పెంచాలంటూ డిమాండ్ ● ముఖ్యమంత్రి స్పందించి న్యాయం చేయాలని వినతి



బొప్పాయి తోటల్లో నిరసన తెలియచేస్తున్న కొత్తపల్లె రైతులు

రైల్వేకోడూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దళారులు, మార్వాడీలు కలసి ఉన్నపళంగా టన్ను బొప్పాయి కాయలను రూ.5 వేలు చేశారని, ఈ ధర తమకు గిట్టుబాటు కాదని ఆదివారం కొత్తపల్లె రైతులు తోటల్లోనే నిరసన తెలియచేశారు. కొందరు రైతులు మాత్రం తోటల్లో బొప్పాయి కాయలు మాగిపోతున్నాయని టన్ను రూ.5 వేలకే కోతలు కోయిస్తున్నారు. దళారీ వ్యవస్థ లేకుండా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మార్వాడీలు నేరుగా రైతులతో సంప్రదించి కోతలు కోయాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజంపేటకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వస్తున్న సందర్భంగా బొప్పాయి రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు, ఓబులవారిపల్లె మండలాలకు చెందిన బొప్పాయి రైతులు కోరుతున్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● అప్స రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు

కడప మారుతీనగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్స) రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు కోరారు. ఆదివారం కడపలో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి పోరు సాగించేందుకు వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. అనంతరం రాష్ట్ర కౌన్సిల్ సలహాదారు సుందరరావు మాట్లాడుతూ స్వంత వాహనాలు, టూరిస్ట్ వాహనాల కాలపరిమితిని 15 నుండి 20 సంవత్సరాలకు పెంచుతున్నట్లుగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. అదే తరహాలో ప్రైవేట్ పాఠశాలల వాహనాలకు వర్తింపచేసేలా ఆదేశాలివ్వాలన్నారు. గ్రీన్ టాక్స్ తగ్గింపుపై ఆర్డినెన్స్ ఇచ్చారే కానీ అందుకు అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. క్రీడామైదానాలను ప్రభుత్వ స్థలాల్లో అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. కాగా 8 సంవత్సరాలుగా వున్న రెన్యువల్ గడువును 10 సంవత్సరాలకు పెంచిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి**

సమావేశానంతరం అప్స జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా సంజీవరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తేజస్విని, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ భాస్కరరావు, వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

## పోలీసుశాఖకు అందించిన సేవలు చిరస్మరణీయం

● ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



పదవీవిరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో నాలుగు దశాబ్దాల పాటు నిర్విరామంగా సేవలందించి పదవీవిరమణ పొందడం అభినందనీయమని, పోలీసుశాఖకు మీరందించిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. ఆగస్టు నెలాఖరున పదవీవిరమణ పొందిన కడప డీసీఆర్‌బీ ఎస్ఐ శివనాగేంద్రకుమార్, కమలాపురం ఏఎస్ఐ ఏవీ రమణయ్య, కడప డీఏఆర్ ఏఆర్‌హెచ్‌సీ బి.శ్రీనివాసులును ఆదివారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి సెల్ ఫోన్లు, కమ్యూనికేషన్ లేని రోజుల్లో కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహించడం మామూలు విషయం కాదని, ఎన్ని ఇబ్బందులున్నా, సమస్యలున్నా బాధ్యత అనేది పోలీసుశాఖలో సమస్యలను అధిగమించేలా చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు వీరేశ్, టైటస్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వెనుకంజలో కడప, కర్నూలు జట్లు

కడప స్పోర్ట్స్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే (మూడు రోజుల) ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్‌లలో భాగంగా వివిధ జట్ల మధ్య సాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లలో రెండో రోజైన ఆదివారం కడప, కర్నూలు జట్లు తమ ప్రత్యర్థి జట్ల కన్నా వెనుకంజలో ఎదురీదుతున్నాయి.

**కేఎస్ఆర్ఎం మైదానంలో..**

నగర శివారు ప్రాంతంలోని కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆటలో 90 ఓవర్ల పాటు ఆడి 3 వికెట్లు కోల్పోయి 346 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. కాగా 346 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి రెండో రోజైన ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొత్తంగా 137.5 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 9 వికెట్లు కోల్పోయి 589 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. కాగా మొదటి రోజు ఆటలో 60 పరుగుల వద్ద నాటౌట్‌గా క్రీజ్‌లో వున్న తేజారెడ్డి రెండోరోజు ఏకంగా 161 పరుగులు చేయడం విశేషం. మరో బ్యాటర్ నిఖిత్‌గౌడ్ 63 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 32.4 ఓవర్లలో 1వికెట్ కోల్పోయి 99 పరుగులు చేసింది. ఇందులో శివకేశవ్‌రాయల్ 52 పరుగులు చేశారు. అయినప్పటికీ మరో 490 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది.

**ఏసీఏ క్రికెట్ మైదానంలో..**

నగర రిమ్స్ సమీపంలోని వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో జరుగుతున్న నెల్లూరు-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 82 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 374 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో సోహన్‌వర్మ 166 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. ఇదిలా వుండగా 374పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి రెండవ రోజైన ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 96.4 ఓవర్లలో 514 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. 166 పరుగులతో నాటౌట్ బ్యాట్స్‌మెన్‌గా క్రీజ్‌లో నిలిచిన సోమన్‌వర్మ 182 పరుగుల వద్ద ఔటయ్యారు. మరో బ్యాటర్ భార్గవ్ 75 పరుగులు చేశారు. కాగా బౌలింగ్ విభాగంలో కర్నూలు జట్టు బౌలర్ అక్షిత్‌రెడ్డి 5 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 41.5 ఓవర్లలో 132 పరుగులకే చేతులెత్తేసింది. పిదప రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో 54 పరుగులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 436 పరుగుల ఆధిక్యత సాధించింది. సోమవారం ఆటకు చివరి రోజు.

## మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వైవీయూ స్కాలర్ సారిక



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ పరిశోధక విద్యార్థిని సారిక ఇటీవల జరిగిన మెగా డీఎస్సీ పరీక్షలో ఆంగ్ల విభాగంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో ఓపెన్ కేటగిరీలో డిస్ట్రిక్ట్‌లో 77.83 మార్కులతో 19వ ర్యాంకు, పీజీటీ ఇంగ్లీష్‌లో 4వ జోన్‌లో 16వ ర్యాంకు, టీజీటీలో 4వ జోన్ పరిధిలో 57వ ర్యాంకు సాధించింది. కడప పట్టణానికి చెందిన మృత్యుంజయకుంట కాలనీలో నివాసముంటున్న వినయకుమార్, కుమారి దంపతుల ప్రథమ కుమార్తె సారిక. తన విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే కొనసాగించారు. క్రమశిక్షణ, పట్టుదల సాధించాలనే తపన ఉంటే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని సారిక నిరూపించారు.

## 23 టీఎంసీలకు చేరువలో గండికోట నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం ఆదివారం 23 టీఎంసీ (22.693)లకు చేరువలో ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 5,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఆదివారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 11,400 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 10,700 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రాజెక్టులోకి 700 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరినట్లు ఈఈ తెలిపారు. కాగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

## రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రెడ్డెయ్య



లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెకు చెందిన ఎర్రగోళ్ల రెడ్డెయ్యను రాష్ట్ర ఫారెస్టు డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెడ్డెయ్య తెలుగుదేశం పార్టీలో కీలక పాత్ర పోషించాడు. 2021లో లక్కిరెడ్డిపల్లె జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఉమ్మడి కడప జిల్లా చైర్మన్ పదవికి పోటీ చేసి ఒక్క సీటుతో ఓటమి పాలయ్యారు. 2006 నుంచి 2008 వరకు ఉమ్మడి కడప జిల్లా టీడీపీ ఆర్గనైజేషన్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుచరుడిగా టీడీపీలో కొనసాగుతున్నారు. రెడ్డెయ్య మాట్లాడుతూ అటవీశాఖకు తనవంతు న్యాయం చేస్తానని తెలిపారు.

## రాయలసీమ పట్ల మొసలి కన్నీరు మానుకోవాలి

● తులసిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాయలసీమ గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ, టీడీపీ, వైసీపీలకు లేదని, మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మూడు పార్టీల పాలనలో రాయలసీమకు నవమోసాలు జరిగాయన్నారు. 1937నాటి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టులలో ఒకటి రాయలసీమలో ఏర్పాటు కావాలి, కానీ ఏర్పాటు కాలేదన్నారు. ప్రత్యేక హోదా రాష్ట్రానికి, ప్రత్యేకించి రాయలసీమకు వరప్రసాదిని, సంజీవని లాంటిదన్నారు. ఇవీ జరగలేదన్నారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వాలి, కానీ ఇవ్వలేదన్నారు. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం, దుగ్గరాజపట్నం ఓడరేవులకు 11ఏళ్లయిన అతీగతీ లేదు, శ్రీకాళహస్తి వద్ద మన్నవరం విద్యుత్ పరికరాల ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి ప్రారంభించిందని, మోదీ ప్రభుత్వం మూసివేయడం జరిగిందన్నారు. 2008లో కడప-రాయచోటి-మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసి ప్రారంభిస్తే దుష్టత్రయం పాలనలో ఈ పనులూ నిలిచిపోయాయన్నారు. కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయలేదన్నారు. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలుగొండ సాగునీటి ప్రాజెక్టులు సింహభాగం కాంగ్రెస్ హయాంలో జరిగితే, పెండింగ్ పనులపై టీడీపీ, వైసీపీలు పూర్తి నిర్లక్ష్యం చేశాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే పైసమస్యలన్నీ ఎప్పుడో పూర్తయి ఉండేవన్నారు.

## ఇంట్లోకి దూసుకెళ్లిన రాళ్ల ట్రాక్టర్

● ఒకరికి గాయాలు ● కొత్తకారు ధ్వంసం



రామయ్య ఇంట్లోకి ట్రాక్టర్ దూసుకువచ్చి కారును ఢీకొట్టిన దృశ్యం

చక్రాయపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చక్రాయపేటలోని ఓ ఇంట్లోకి రాళ్లలోడుతో ఉన్న ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎర్రగుంట్ల నుంచి రాళ్లలోడుతో ట్రాక్టర్ చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లెకు వెళ్తోంది. ఈ సమయంలో చక్రాయపేటలోని స్టేట్‌బ్యాంక్ ఎదురుగా ఒక స్పీడ్ బ్రేకర్ ఉంది. ఇది గమనించని రాళ్లలోడు ట్రాక్టర్ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో అదుపు తప్పి ట్రాక్టర్ రామయ్య ఇంట్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో రమేష్ అనే వ్యక్తి తన ఇంటి గోడకు పెయింట్ వేసుకుంటున్నాడు. ట్రాక్టర్ అటువైపు రావడం చూసిన తల్లిదండ్రులు రమేష్‌ను పక్కకు తోసేశారు. దీంతో రమేష్ అస్వస్థతకు గురయ్యాడు. అలాగే కొత్తగా తెచ్చుకున్న కారు ధ్వంసమైంది. అస్వస్థతకు గురైన రమేష్‌ను వేంపల్లె ఆసుపత్రికి తరలించగా ప్రాణాపాయం లేదని కాలుకు గాయమైందని డాక్టర్లు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మైలవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపరాల గ్రామానికి చెందిన యువకుడు చిమ్మని వెంకటరమణ (30) పెన్నానదిలోకి ఈతకు వెళ్లి శనివారం గల్లంతైన విషయం తెలిసిందే. యువకుడికి కోసం పోలీసుశాఖ, ఫైర్ సిబ్బంది ముమ్మర చర్యలు చేపట్టిన తర్వాత ఆదివారం ఉదయం యువకుడి మృతదేహం లభ్యమైందని, ఇది చిమ్మని వెంకటరమణగా గుర్తించామని ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్నందున పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు నీటిలో దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## కరెంటు షాక్‌తో గేదె మృతి

సీకేదిన్నె, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలుపల్లె నివాసి నారాయణమ్మకు చెందిన గేదె ఆదివారం కరెంటు షాక్‌తో మృతి చెందింది. పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వద్ద గేదెకు షాక్ తగలడంతో మృతిచెందిందని, నారాయణమ్మకు కూడా గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో రిమ్స్‌కు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో గేదె మృతి చెందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దాదాపు రూ.70వేలు విలువ చేసే గేదె మృతిచెందడంతో నారాయణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బోరు పెద్దపుల్లారెడ్డి(68) మృతి చెందాడు. గ్రామానికి చెందిన పుల్లారెడ్డి బైకులో రోడ్డు దాటుతుండగా మరో బైకు వచ్చి ఢీకొనడంతో కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాగా మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైలును ఢీకొని యువకుడికి గాయాలు

కమలాపురం రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలును ఢీకొని విద్యార్థికి గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రైల్వేపోలీసులు తెలిపిన సమాచారం మేరకు... పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన విద్యార్థి శ్రీహరిని వినాయక నిమజ్జనానికి వెళ్లొద్దని కుటుంబసభ్యులు మందలించినందుకు శనివారం రాత్రి రైలు కింద పడడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని పరిశీలించి అదేరోజు రాత్రి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శ్రీహరి 9వతరగతి చదువుతున్నాడు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కిరాణా షాపులో సిగరెట్లు చోరీ

రాజంపేట టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలోని ప్రధాన రహదారిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా ఉన్న కిరాణాషాపులో శనివారం అర్ధరాత్రి వేళ షాపుపై ఉన్న రేకులకు కన్నం వేసి రూ.10 వేలు విలువ చేసే సిగరేట్ ప్యాకెట్లను, రూ.15 వేల నగదు దొంగలించినట్లు యజమాని అబ్దుల్‌గని తెలిపారు. ఈ విషయంపై పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చామని, ఈ మేరకు పట్టణ సీఐ నాగార్జున కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నిమజ్జనంలో అపశ్రుతి

● చెరువులో పడి యువకుడి మృతి



నాగేంద్ర ఫైల్‌ఫొటో

కురబలకోట ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కేరింతలు, ఉల్లాసాల మధ్య సాగుతున్న వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. కురబలకోట మండలంలో చోటు చేసుకున్న ఈ విషాదకర సంఘటన వివరాల్లోకెళితే.. శనివారం వినాయకుడిని గ్రామ సమీపంలోని మల్లేశ్వరమ్మ కొత్త చెరువులో నిమజ్జనం చేసేందుకు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. కాగా చెరువులో ప్రతిమను నిమజ్జనం చేస్తుండగా తొక్కిసలాట జరగడంతో నాగేంద్ర (35) చెరువులో పడ్డాడు. అతడిని కాపాడేందుకు పలువురు విఫలయత్నం చేశారు. మృతుడు పుంగనూరు సమీపంలోని మోదుగులపల్లె వాసిగా స్నేహితులు తెలిపారు. కాగా మృతదేహాన్ని ఆదివారం వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## బోల్తా పడిన ట్రాక్టర్

చక్రాయపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహదేవపల్లె గ్రామంలో ఆదివారం వినాయక నిమజ్జనంలో భాగంగా అపశ్రుతి చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే... మహదేవపల్లెలో వినాయక నిమజ్జనం సందర్భంగా ట్రాక్టర్‌లో ఊరేగింపుగా వెళ్లారు. నిమ్జనం చేసి వస్తుండగా గ్రామ సమీపంలోని ఓ కాల్వలో అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. అందులో ఉన్నవారు కాల్వలో పడిపోయారు. ఈ ప్రమాదంలో ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి. హుటాహుటిన అందరిని ఆసుపత్రికి తరలించారు. అయితే ఎవరికీ ఎటువంటి ప్రాణహాని కలగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.





# ఆపద వేళ.. మహిళల అస్త్రం.. శక్తి యాప్



● ప్రత్యేక టీములతో అవగాహన సదస్సులు
● జిల్లావ్యాప్తంగా శక్తియాప్ డౌన్‌లోడ్ 14097
● ఎస్‌వోఎస్ ఫిర్యాదులు 66





కడప క్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): శక్తి యాప్ మహిళలకు ఒక అస్త్రం వంటిది. ఆపద సమయంలో వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ఈ యాప్ బ్రహ్మాస్త్రంగా పనిచేస్తుంది. ఒంటరి మహిళలకు ఇది ఒక ఆయుధంలా ఉపయోగపడుతుంది అంటే అతిశయోక్తి లేదు. మహిళలు, విద్యార్థినులు, చిన్నారుల భద్రత, రక్షణ కోసం పోలీసుశాఖ కొత్తగా శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సెల్‌ఫోన్‌లో ఈ యాప్ ఉంటే నిరంతరం ఓ తండ్రి లేదా సోదరుడు, ఓ పోలీసు మీ వెన్నంటి తోడుగా ఉన్నట్లేనని చెప్పవచ్చు. ఈ యాప్ ఓపెన్ చేసి ఎస్‌వోఎస్ ఫోన్‌ను ఊపినా పోలీసులు వస్తారు. అత్యవసర పరిస్థితులు, ఆపదలో చిక్కుకున్న మహిళలు ఈ యాప్ ఓపెన్ చేసి అందులోని ఏపీపీఎస్ ఆప్షన్‌పై నొక్కితే వెంటనే పది సెకన్ల నిడివి గల వీడియో, ఆడియో ఆటోమేటిక్‌గా రికార్డు అయి ఘటనాస్థలం లోకేషన్ సహా పోలీసు కంట్రోల్ రూముకు సమాచారం చేరుతుంది. బాధితురాలు ఏ పరిస్థితుల్లో ఉన్నారో పోలీసులకు అర్థమవుతుంది.

### పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు

మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఈ యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. గివ్ ఏ కంప్లయింట్ విభాగంలోకి వెళ్లి జిల్లా, పోలీసుస్టేషన్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ అంశంపై ఫిర్యాదు చేస్తున్నారో పేర్కొని మీ వివరాలు నమోదు చేయాలి. కాగితంపై రాసిన లేదా టైపు చేసిన ఫిర్యాదు ప్రతిని అప్‌లోడ్ చేయాలి. దాన్ని పరిశీలించి పోలీసులు మిమ్మల్ని సంప్రదిస్తారు. వేధింపులు, గృహహింస, అత్యాచారం, లైంగిక దాడులు, ఈవ్‌టీజింగ్, పరువు హత్య, యాసిడ్ దాడులు, మానవ అక్రమ రవాణా, బలవంతపు వివాహాలు, బాల్యవివాహాలు, అపహరణలు, సైబర్ బుల్లీయింగ్, ఫోటోమార్ఫింగ్ తదితర నేరాలపై ఫిర్యాదు చేయవచ్చు.

### 24గంటలూ అందుబాటులో ఉంటాం..

శక్తియాప్ ద్వారా ఫిర్యాదు చేసేవారికి అండగా ఉంటాం. అలాగే 24 గంటలూ మహిళలు, బాలికలు, చిన్నారులకు అందుబాటులో ఉంటాం. మహిళలకు, కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ఈ యాప్ ఉపయోగాలపై వివరిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా శక్తి యాప్‌ను 14097మందితో డౌన్‌లోడ్ చేయించాం. ఎస్‌వోఎస్ కాల్స్ టెస్టింగ్ కోసం 2882 మందితో చేయడం జరిగింది. ఒరిజినల్ కాల్స్ 66వచ్చాయి. జిల్లావ్యాప్తంగా ఏడు శక్తి టీమ్‌లు ఉన్నాయి. కడపలో 3, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల సబ్ డివిజన్లలో ఒక్కో శక్తి టీం ఉంది. అలాగే ఒక్కో టీమ్‌లో ఆరుగురు సభ్యులు ఉంటారు. వీరిలో ఒక ఎస్ఐతో పాటు మహిళా సిబ్బంది ఉంటారు. మహిళా సమస్యలపై నిరంతరం మా సిబ్బంది అప్రమత్తంగా ఉండి వారికి అవగాహన సదస్సుల ద్వారా చైతన్యం కల్పిస్తున్నాం.

\- బాలస్వామిరెడ్డి,
కడప మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ

### ఒంటరి ప్రయాణానికి ఎంతో ఉపయోగం

రాత్రివేళ ఎవరూ అందుబాటులో లేకపోతే ఒంటరిగా ఉన్న మహిళలకు ఈ శక్తియాప్ ఎంతో ఉపయోగపడుతుంది. మీరు ప్రయాణించే వెహికల్ నెంబరు కానీ, లైవ్ లొకేషన్ గానీ ఈ గ్రూపులో పొందుపరిస్తే చాలు... నిమిషాల్లో పోలీసులు అక్కడికి చేరి వీరికి నీడలా తోడుంటారు. ఆపద వేళలో వారికి రక్షణ కవచంలా ఈ శక్తియాప్ నిలబడుతుంది.



కడప ఆర్టీసీ బస్టాండులో శక్తియాప్ డౌన్‌లోడ్ చేస్తున్న మహిళా పోలీసుస్టేషన్ సిబ్బంది

# బొప్పాయి తోటల్లో రైతుల నిరసన

● ధరలు పెంచాలంటూ డిమాండ్ ● ముఖ్యమంత్రి స్పందించి న్యాయం చేయాలని వినతి



బొప్పాయి తోటల్లో నిరసన తెలియచేస్తున్న కొత్తపల్లె రైతులు

రైల్వేకోడూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దళారులు, మార్వాడీలు కలసి ఉన్నపళంగా టన్ను బొప్పాయి కాయలను రూ.5 వేలు చేశారని, ఈ ధర తమకు గిట్టుబాటు కాదని ఆదివారం కొత్తపల్లె రైతులు తోటల్లోనే నిరసన తెలియచేశారు. కొందరు రైతులు మాత్రం తోటల్లో బొప్పాయి కాయలు మాగిపోతున్నాయని టన్ను రూ.5 వేలకే కోతలు కోయిస్తున్నారు. దళారీ వ్యవస్థ లేకుండా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మార్వాడీలు నేరుగా రైతులతో సంప్రదించి కోతలు కోయాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజంపేటకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వస్తున్న సందర్భంగా బొప్పాయి రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు, ఓబులవారిపల్లె మండలాలకు చెందిన బొప్పాయి రైతులు కోరుతున్నారు.

## పార్టీలో కష్టపడ్డవారికి తగిన గుర్తింపు

● ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



చంద్రశేఖర్ అభినందన సభలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అధికారంలో లేనప్పుడు పోరాట పటిమతో ముందు నిలిచిన వారికి ప్రాధాన్యత వుంటుందన్నారు. కలికిరిలో రాష్ట్ర జంగం సంక్షేమ కార్పొరేషన్ అధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్ అభినందన సభలో ఆయన మాట్లాడారు. అంగళ్లులో జరిగిన దాడులకు సంబంధించిన వైసీపీ ప్రభుత్వం నమోదు చేసిన కేసులో చంద్రబాబు సహా తాను, చంద్రశేఖర్ కూడా ఉన్నామని గుర్తు చేశారు. అదే రోజు జరిగిన పుంగనూరు దాడుల్లో కూడా చంద్రశేఖర్‌ను ఇరికించారన్నారు. జంగం కులస్థులను ఆర్థికంగా ఆదుకోవడానికి కార్పొరేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్ కృషి చేయాలని సూచించారు. అనంతరం పలువురు సంఘం నేతలు చంద్రశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వినయ్‌భూషణరావు, విశ్వేశ్వరయ్య, రాంబాబు, జె.చంద్రశేఖరయ్య, అద్దంకి నాగరాజు, రమణయ్య, బాలయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

## సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు విశేష పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సంతానం లేని దంపతులు ఆకుపసురును తాగి అమ్మవారి చెంత వరపడ్డారు. కర్ణాటక, తిరుపతి, కడప, అనంతపురం, చిత్తూరు నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈవో మంజులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గణేశ్ లడ్డూ రూ.2 లక్షలు



వెలిగల్లులో రూ. 2లక్షల గణపయ్య లడ్డూతో చిన్నరెడ్డెప్ప

పెద్దమండ్యం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వెలిగల్లులో ఆదివారం గణనాథుని నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో చిట్టిమాని చిన్నరెడ్డప్ప రూ.2,15,116 అత్యధికంగా పాడి లడ్డూను దక్కించుకున్నారు. కలిచెర్లలో గుర్రం రమేష్ రూ.1,50,000 అత్యధికంగా పాడి గణపతి లడ్డూను దక్కించుకోగా, బాటవారిపల్లిలో గణపయ్య లడ్డూ రూ.76 వేలు పలికింది. కార్యక్రమంలో రెడ్డప్ప, రామాంజులు నాయుడు, మనోజ్‌కుమార్, సాంబశివరెడ్డి, ప్రభాకరరెడ్డి, రజనీకాంత్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### బాటవారిపల్లె గణపతి లడ్డూ రూ.1.30లక్షలు

కలకడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బాటవారిపల్లె మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద నైవేద్యంగా ఉంచిన లడ్డూ రూ.1.30 లక్షలు పలికింది. లడ్డూకు వేలం నిర్వహించగా దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఈ లడ్డూను దక్కించుకున్నారు. కలకడ తేరువీధులో స్వామివారి లడ్డూను సుబ్బయ్య రూ.89 వేలకు దక్కించుకున్నాడు.



లడ్డూను దక్కించుకున్న దగ్గుబాటి వెంకటేశ్వర రావు

## మహిళ ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లి ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకొంది. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసుల కథనం మేరకు... కొండయ్యగారిపల్లి పంచాయతీ దాసరిపేటకు చెందిన తన్నీరు ద్వారకనాథ్ భార్య లీలావతి(36) తన ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు వెంటనే నిమ్మనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. లీలావతి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సివుంది.

## ద్విచక్రవాహనం ఢీకొని నలుగురికి గాయాలు

నిమ్మనపల్లి ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకొంది. స్థానికుల వివరాల మేరకు... తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లికి చెందిన సుభాన్‌బాషా (33), భార్య రమీజా(26) తమ ఇద్దరు పిల్లలతో కలసి గ్రామసమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు బయలుదేరారు. మార్గమధ్యంలో కొమ్మిరెడ్డిగారిపల్లి మలుపు వద్దకు రాగానే మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీకొంది, ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు కావడంతో మదనపల్లి జిల్లా ఆసుపత్రి తరలించి చికిత్సలు అందించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రెడ్డెయ్య



లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెకు చెందిన ఎర్రగోళ్ల రెడ్డెయ్యను రాష్ట్ర ఫారెస్టు డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెడ్డెయ్య తెలుగుదేశం పార్టీలో కీలక పాత్ర పోషించాడు. 2021లో లక్కిరెడ్డిపల్లె జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఉమ్మడి కడప జిల్లా చైర్మన్ పదవికి పోటీ చేసి ఒక్క సీటుతో ఓటమి పాలయ్యారు. 2006 నుంచి 2008 వరకు ఉమ్మడి కడప జిల్లా టీడీపీ ఆర్గనైజేషన్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుచరుడిగా టీడీపీలో కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖకు తనవంతు న్యాయం చేస్తానని తెలిపారు.

# వెనుకంజలో కడప, కర్నూలు జట్లు

కడప స్పోర్ట్స్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే (మూడు రోజుల) ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్‌లలో భాగంగా వివిధ జట్ల మధ్య సాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లలో రెండో రోజైన ఆదివారం కడప, కర్నూలు జట్లు తమ ప్రత్యర్థి జట్ల కన్నా వెనుకంజలో ఎదురీదుతున్నాయి.

### కేఎస్ఆర్ఎం మైదానంలో..

నగర శివారు ప్రాంతంలోని కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆటలో 90 ఓవర్ల పాటు ఆడి 3 వికెట్లు కోల్పోయి 346 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. కాగా 346 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి రెండో రోజైన ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొత్తంగా 137.5 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసి 9వికెట్లు కోల్పోయి 589 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. కాగా మొదటి రోజు ఆటలో 60 పరుగుల వద్ద నాటౌట్‌గా క్రీజ్‌లో వున్న తేజారెడ్డి రెండోరోజు ఏకంగా 161 పరుగులు చేయడం విశేషం. మరో బ్యాటర్ నిఖిత్‌గౌడ్ 63 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 32.4 ఓవర్లలో 1వికెట్ కోల్పోయి 99 పరుగులు చేసింది. ఇందులో శివకేశవ్‌రాయల్ 52 పరుగులు చేశారు. అయినప్పటికీ మరో 490 పరుగుల వెనుకంజలో ఎదురీదుతోంది.

### ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగర రిమ్స్ సమీపంలోని వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో జరుగుతున్న నెల్లూరు-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 82ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 374 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో సోహన్‌వర్మ 166 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. ఇదిలా వుండగా 374పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో తిరిగి రెండవ రోజైన ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 96.4 ఓవర్లలో 514 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. 166 పరుగులతో నాటౌట్ బ్యాట్స్‌మెన్‌గా క్రీజ్‌లో నిలిచిన సోమన్‌వర్మ 182 పరుగుల వద్ద ఔటయ్యారు. మరో బ్యాటర్ భార్గవ్ 75 పరుగులు చేశారు. కాగా బౌలింగ్ విభాగంలో కర్నూలు జట్టు బౌలర్ అక్షిత్‌రెడ్డి 5 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 41.5 ఓవర్లలో 132 పరుగులకే చేతులెత్తేసింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 10ఓవర్లలో 54పరుగులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 436 పరుగుల ఆధిక్యత సాధించింది.


పీలేరు ఎస్వీ డీలక్స్ వద్ద భారీ వినాయకుడిని క్రేన్‌తో వాహనంలోకి ఎక్కిస్తున్న దృశ్యం
మదనపల్లెలో ఊరేగుతున్న గణనాధుడు
పీలేరులో ప్రత్యేక ఆకర్షణగా నిమజ్జన ఊరేగింపు
వాల్మీకిపురంలో గంగమ్మ ఒడిలోకి ఒదిగి పోతున్న గణపతి

# గంగ ఒడికి....

**● కోలాహలంగా సాగిన గణేశ్ నిమజ్జనం ● ఆకట్టుకున్న కేరళ సంప్రదాయ నృత్యాలు ● పీలేరులో వైభవంగా వినాయక శోభాయాత్ర**

పీలేరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ముల్లోకాల్లో తొలి పూజలందుకునే విఘ్ననాయకుడు బుధవారం నుంచి ప్రజాబాహుళ్యంతో ప్రత్యేక పూజలందుకుని, వారికి తగిన ఆశీస్సులు అందించారు. యువకుల్లో ఆనందం నిండగా పట్టణాల్లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకునేలా చవితి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా చేసుకున్నారు. ఆదివారం ఐదోరోజున గణనాయకుడిని గంగ ఒడికి చేర్చేందుకు పయనమయ్యారు. యువకుల అవిశ్రాంత కేరింతలు, నృత్యాలు, హోరెత్తించే డీజేలు, ఉర్రూతలూగించే బళ్లారి డ్రమ్ములు, తనువు, మనసులను పులకింపజేసే కేరళ సంప్రదాయ నృత్యాలు, ఎడతెగని బాణసంచా పేలుళ్లు, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలు, ఒక దానిని మించిన ఆకృతులతో భారీ వినాయక ప్రతిమలు, వీటన్నింటి మధ్య "జై బోలో గణేశ్ మహరాజ్ కీ...జై" అంటూ నినాదాలు వాడవాడలా గ్రామాలు, పట్టణాలు హోరెత్తించాయి.


పీలేరులో నిమజ్జన ర్యాలీలో యువత డ్యాన్సులు

పీలేరులో ఆదివారం గణేశ్ సామూహిక నిమజ్జనం అత్యంత శోభాయమానంగా సాగింది. నిమజ్జనాన్ని సామూహికంగా అన్ని కేంద్రాల్లోనూ ఒకేరోజు నిర్వహించే సంప్రదాయం హైదారాబాదు తరువాత ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పీలేరులో మాత్రమే జరుగుతుంది. పీలేరు పట్టణం సహా పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో సైతం ఒకేరోజు ప్రతిమలను ప్రతిష్ఠించడం, ఒకేరోజు సామూహికంగా నిమజ్జనం చేయడం ప్రత్యేకత. ప్రతి సెంటర్ నుంచి పుర వీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేయడం ఆనవాయితీ. పట్టణంలో ప్రతిష్ఠించిన 82 ప్రతిమలు, పరిసర గ్రామాల్లోని ప్రతిమలతో నిర్వాహకులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆదివారం ఉదయం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద టీడీపీ, బీజేపీ నేతలు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించగా పట్టణమంతటా కోలాహలంగా సాగింది. నిర్వాహకులు డీజేలు, బళ్లారి డ్రమ్ములు, కేరళ కళాకారులు, తమిళనాడు కళాకారులు, సంప్రదాయ చెక్కభజన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక ప్రతిమల శోభా యాత్రలో భాగంగా పీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన హారతి కార్యక్రమంలో రాష్ట్ర గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, ఫైర్, ఏపీ ట్రాన్స్‌కో, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సేవలు అందించారు. ఆర్యవైశ్య, వడ్రంగి, స్వర్ణకారులు, ట్రాక్టర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

## వేడుకగా ఊరేగింపు


కలకడలో....

కలకడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా వినాయకుడి ప్రతిమల నిమజ్జనం కోలాహలంగా నిర్వహించారు. కలకడ, బాటవారిపల్లె, ఇందిరమ్మకాలనీ, గరుడప్పగారిపల్లె తదితర గ్రామాల్లో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం సమీప నదులు, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి అన్నదానాలు చేశారు.

## పుల్లేటిచెరువుపల్లెలో నిమజ్జనం

వాల్మీకిపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలం వ్యాప్తంగా వినాయక ప్రతిమల నిమజ్జనం పుల్లేటిచెరువుపల్లెలో వైభవంగా నిర్వహించారు. గణేష్ లడ్డూ వేలం పోటాపోటీగా సాగింది. సింగిల్‌విండో డైరెక్టర్ లంకిపల్లె మధు లక్ష 16వేలకు లడ్డూ సొంతం చేసుకున్నారు. పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు, పునుగుపల్లె, చింతపర్తి తదితర గ్రామాల్లో కూడా వేడుకలు కోలాహలంగా సాగాయి. సీఐ రాఘవరెడ్డి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

## కలికిరిలో వైభవంగా...

కలికిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలు, పట్టణంలోని అమరనాథ రెడ్డి కాలనీ, బ్రాహ్మణ వీధి తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలను ఏర్పాటు చేసి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. డప్పులు, బ్యాండు వాయిద్యాలు, నృత్యాలు, కోలాటాల మధ్య యువకులు ఉత్సాహంగా నిమజ్జనంలో పాల్గొన్నారు.


కలికిరిలో....


పీలేరులో దద్దరిల్లిన తమిళనాడు డ్రమ్ములు

## పీటీఎంలో మార్మోగిన గణేశ్ నామం


పెద్దతిప్పసముద్రంలో....

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఐదో రోజు వినాయక నిమజ్జనవేడుకలను ప్రజలు కోలాహలంగా చేశారు. జై గణేశా... జైజై గణేశా మార్మోగగా మేళతాళాలు, మంగళావాయిద్యాలు, బళ్లారి డ్రమ్ములతో కోలాహలంగా నిమజ్జన వేడుకలు చేసుకున్నారు. గణనాథుని లడ్డూను వేలంలో దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. చింతకాయవీధి, సంతబజారు, పెద్దకాలువగడ్డ, అంబేడ్కర్‌నగర్ గణనాథులను నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని పలు గణనాథులు శోభాయాత్రగా పురవీధుల్లో యువతీ, యువకులు ఉత్సాహం, కేరింతలతో సందడి నెలకొంది. గణనాథులను వంకలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. భక్తులకు అధిక సంఖ్యలో అన్నదానాలను ఏర్పాటు చేశారు.

## ములకలచెరువులో మోగిన బళ్లారి డప్పులు

ములకలచెరువు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్, వినాయకనగర్, దీక్షిత్‌రెడ్డి హోటల్, పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రతిమలను బళ్లారి డప్పులు, భారీ బాణసంచా పేలుళ్ల మధ్య వినాయక ప్రతిమలను ఊరేగించి నిమజ్జనం చేశారు.


ములకలచెరువులో వినాయకుడిని ఊరేగిస్తున్న యువకులు

## మదనపల్లెలో చిందేసిన యువత

మదనపల్లె అర్బన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలోని గ్రామాల్లో వినాయక ప్రతిమల నిమజ్జనంలో యువత చిందేయడంతో కోలాహలంగా సాగింది. పట్టణ సమీపంలో పోలీసులు నాలుగు చెరువుల్లో నిమజ్జనానికి అనుమతులు ఇచ్చారు. ప్రతిమలను నిమజ్జనానికి క్రేన్‌ను అందుబాటులో పెట్టారు. మార్వారివీధిలో వినాయకుడికి విశేష పూజల అనంతరం ఊరేగిస్తూ తట్టివారిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. కనకదాస్‌నగర్, సిరికల్చర్ కాలనీ, బీకేపల్లె ప్రతిమలు, అనపగుట్ట నుంచి యువత వినాయక ప్రతిమలు, నీరుగట్టువారిపల్లెలోని ప్రతిమలను తట్టివారిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. యువకులు దివాకర్, మధుసూదన్, రమణ, వెంకటరమణ, బాబు, మల్లి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు. చిత్తూరు బస్టాండ్ సమీప పురవీధుల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను బైపాస్ రోడ్డులోని స్వామి చెరువులో నిమజ్జనం చేశారు. బసినికొండ, రామాచార్లపల్లె, బసినికొండ 1, కొత్తపల్లె, పోతబోలు, సీటీఎం గ్రామాల్లో నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు.

## కోలాటాలతో ఊరేగింపు


కలిచెర్లలో గణపయ్య నిమజ్జనం ఊరేగింపు

పెద్దమండ్యం, ఆగష్టు 31(ఆంధ్రజ్యోతి): కలిచెర్ల, వెలిగల్లు, బాటవారిపల్లి, తాటిమాకులపల్ల, కోటకాడపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం వినాయక ప్రతిమల నిమజ్జనం ఊరేగింపును భక్తులు కోలహలంగా, కోలాటలు, చెక్క భజనలతో సాగింది. గాలివీడు వెలిగల్లు ప్రాజెక్టు, గ్రామాల సమీప చెరువుల్లో గణపయ్య నిమజ్జనం చేశారు. వినాయకుడు నిమజ్జనం ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## బి.కొత్తకోటలో ఉత్సాహంగా మహిళలు


బి.కొత్తకోటలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

బి.కొత్తకోట, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): నగరపంచాయతీ సహా మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం వినాయక ప్రతిమల నిమజ్జనం ఘనంగా జరిగింది. బాణసంచా పేలుళ్లు, బళ్లారి డ్రమ్ముల వాయిద్యాల నడుమ యువకుల నృత్యాలు, మహిళలు సైతం రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతకు మునుపు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని బహిరంగ వేలం వేశారు. వేమిలేటికోట గ్రామంలో నిమజ్జనం అట్టహాసంగా జరిగింది. అక్కడి వినాయకుడి లడ్డూ వేలంలో ఉపాధ్యాయుడు నవప్రసాద్‌రెడ్డి, శ్రీకర్‌రెడ్డిలు రూ.1,16,000కు ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

## కోలాహలంగా తరలిన గణనాధులు

గుర్రంకొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక నిమజ్జనం వైభవంగా చేసుకున్నారు. గుర్రంకొండ, తరిగొండ, అరిగెలవారిపల్లె, తలారివాండ్లపల్లె, అమిలేపల్లె, చెర్లోపల్లె, ఎల్లుట్ల, సరిమడుగు, రామాపురం గ్రామాల్లో వినాయక నిమజ్జనాన్ని ప్రజలు, యువత కోలాహలంగా చేసుకున్నారు. వినాయక ప్రతిమలను ట్రాక్టర్లలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


పీలేరు జెండామాను ప్రాంతంలో సాగుతున్న గణపయ్య శోభాయాత్ర


వాల్మీకిపురంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు


మదనపల్లె మార్వారివీధిలో.....


గుర్రంకొండలో...

# పోలీసుల సంక్షేమానికి చర్యలు : డీఐజీ


పోలీస్ వెల్ఫేర్ ఐఓసీ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

కలికిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వివిధ వత్తిడుల మధ్య రేయింబవళ్లు పనిచేస్తున్న పోలీసుల కోసం నెలకొల్పిన సంక్షేమ సంస్థను అన్ని విధాలా బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ చెప్పారు. ఆదాయ మార్గాలున్న చోట్ల నిధులు సమీకరించి సంక్షేమ సంస్థను విస్తరిస్తున్నామన్నారు. సంస్థ ఆధ్వర్యంలో కలికిరి పోలీసు స్టేషన్ ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐఓసీ పెట్రోలు ఫిల్లింగ్ ఔట్‌లెట్‌ను ఆదివారం కోయ ప్రవీణ్ ప్రారంభించారు. జిల్లాలోని మూడింటితో పాటు కర్నూలు రేంజిలో మొత్తం 10 పెట్రోలు బంకులు ఏర్పాటు చేశామని డీఐజీ వివరించారు. కలికిరి ప్రాంత ప్రజల కోసం నాణ్యమైన పెట్రోలు, డీజిల్ అందించడమే లక్ష్యంగా ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. కలికిరి అప్‌గ్రేడెడ్ పోలీసు స్టేషన్‌కు సీఐ సహా అదనంగా ఎస్ఐను నియమించాలనే విషయంపై ఆయన స్పందిస్తూ ఇక్కడ ఎస్ఐ పోస్టును అప్‌గ్రేడ్ చేసి స్టేషన్ హౌస్ ఆఫీసరుగా సీఐ స్థాయి అధికారిని నియమించామన్నారు. కలికిరిలో సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, సైనిక్ స్కూల్, జేఎన్టీయూలాంటి సున్నితమైన సంస్థలున్న కారణంగా అదనంగా ఒక ఎస్ఐని నియమించేందుకు ప్రయత్నిస్తామని డీఐజీ హామీ ఇచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి ఆయన ఫిల్లింగ్ స్టేషన్, పంపింగ్ సెంటర్లను ప్రారంభించారు. మొదటగా డీఐజీ వాహనానికి ఆయనే స్వయంగా డీజిల్ నింపారు. కార్యక్రమంలో రాయచోటి ఎస్డీపీఓ ఎం.ఆర్. కృష్ణమోహన్, పోలీస్ వెల్ఫేర్ రిజర్వ్‌డ్ సీఐ పెద్దయ్య, కలికిరి సీఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ జోసెఫ్, హెచ్‌సీలు మదనమోహన్ రెడ్డి, రఫీ, మహ్మద్ ఆలీ, భూషణ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వోద్యోగులు ఆదర్శంగా నిలవాలి


లక్ష్మీనారాయణకు బహుమతి ఇస్తున్న జిల్లా సర్వే ఏడీ భరత్‌కుమార్

మదనపల్లె టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు సేవలందించడంలో సహచరులకు ఆదర్శంగా నిలవాలని భూసర్వే, రికార్డుల జిల్లా ఏడీ భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో మదనపల్లె, తంబళ్లపల్లె డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు పలికారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో సర్వే విభాగంలో లక్ష్మీనారాయణ అందించిన సేవలు పారదర్శకంగా వున్నాయన్నారు. రెవెన్యూ ఉద్యోగులు వారి సర్వీసులో మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. అనంతరం లక్ష్మీనారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టరేట్ డీఏఓ నిర్మలదేవి, డీఐలు కృష్ణమూర్తి, రవిచంద్ర, రమణారెడ్డి, సుబ్రమణ్యం, డీటీ నవీన్, ఎస్ఏ గిరిధర్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి భరోసా సీఎం రిలీఫ్ ఫండ్


బాధితురాలికి మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

కలికిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా అని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర ఖజానా ఇబ్బందికర పరిస్థితుల్లో వున్నా ఆపన్నులను ఆదుకునే విషయంలో సీఎం చంద్రబాబు వెనుకాడటం లేదన్నారు. నగరిపల్లెలోని పార్టీ క్యాంపు కేంద్రంలో ఆయన 8 మందికి రూ.10,50,307ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ అధ్యక్షుడు కంభం నిరంజన్ రెడ్డి, వాల్మీకిపురం ఏఎంసీ ఛైర్మన్ కోసూరి చంద్రమోహన్, పార్టీ అధికార ప్రతినిధి వలిగట్ల వెంకట్రమణ, సింగిల్ విండో అధ్యక్షుడు కె.కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

## యూరియా కొరత లేకుండా చేస్తాం

రామసముద్రం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు ఏఓ జాఫర్ తెలిపారు. ఆగస్టులో ఇప్పటి వరకు మండలంలోని ఆర్‌బీకేల ద్వారా 4000 బస్తాలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా 1375 బస్తాల యూరియా పంపిణీ చేశాయమన్నారు. మండలంలో వరి సాగు ఎక్కువగా ఉండడంతో యూరియా ఇంకా అవసరం ఉందని రైతులు కోరుతున్నారని, అవసరాలకు అనుగుణంగా యూరియా నిల్వలు పెంచుతామన్నారు. కాగా ఆదివారం మూగవాడి గ్రామంలో 300 బస్తాలు యూరియా పంపిణీ చేసినట్లు ఏఓ తెలిపారు.